# సగటు మనిషి

ఎక్కడికి మాస్టారూ!

ఆ రోజు జీతాలందుకుని, అప్పటి కప్పుడే తోటి ఉపాధ్యాయునికి, త్రోవలో కనపడ్డ అప్పులవాళ్ళకి ఇవ్వగా మిగిలిన చిల్లరనోట్లను జేబులో కుక్కుకొని నడుస్తున్న మాస్టారు నడివీధిలో ఆగిపోయారు. నడివీధిలో వేపచెట్టు క్రింద బండరాతిమీదనున్న ఓ ఆశ, ఓ ప్రలోభం, ఓ ఆకర్షణ అతనిని అక్కడే నిలిపేసింది దానివైపు ఒక్కడుగేసిన మాస్టారుని అసహాయత, బాధ్యత గుర్తుచేసి హెచ్చరించి రెండడుగులు వెనక్కు నడిపింది. అలా ఒక ఘడియసేపు తచ్చాడిన మాస్టారుని ప్రలోభమే గెల్చుకుంది గబగబ ముందుకు నడిచారాయన

అది మారుమూల ఒక చిన్న పల్లెటూరు నాగరికతకు దూరంగా నున్న ఆ పల్లెటూరిని కూడ లాటరీ దయ్యం పట్టుకుంది. ఏజెంటు సుందరరావు రూపంలో రచ్చబండమీద ఎక్కి కూర్చుంది. తమాషా ఏమంటే ఆ దయ్యాన్ని చూచి ప్రజలు విపరీతంగా ఆకర్షింపబడుతున్నారు.

'రండి మాస్టారూ!' సవినయంగా ఆహ్వానించాడు ఏజంటు సుందరరావు. అతనెక్కడివాడో కాదు, ఆ ఊరిలో ఎక్కువగా చదువుకున్న యస్. యస్. యల్. సి. కుర్రాడు బ్రతకనేర్చినవాడు. తన పుట్టిన ఊరిని ఉద్ధరించే నిమిత్తం ఈ బృహత్కార్యానికి కంకణం కట్టుకున్నానని చెప్తూ వుంటాడు.

ఇన్ని నెలలుగా లాటరీ తీస్తున్నారుగాని ఆ వూరి వారిలో ఎవ్వరికీ యింకా మోక్షం రాలేదు.

'ఏమిటోయ్ సుందరరావ్! వ్యాపారమెలాగుంది?' సుందరరావును ప్రశ్నతో బాటు తన మనసులో కోరికనుకూడా ఒక్క క్షణం ప్రక్కన పెట్టి పరామర్శించారు మాస్టారు. 'వ్యాపారానికేముంది మాస్టారూ! మీలాంటి వాళ్ళంతా నా చెయ్యి చలవవల్ల చల్లగా బ్రతకాలిగాని'

మాస్టారుగా పిలవబడుతున్న ఆయన ఆ ఊరు ఎలిమెంటరీ స్కూలుకు హెడ్ మాస్టరు. ఆయన పేరు సదానందం. కానీ ఆయన మనసార నవ్వగా ఎవ్వరూ చూచిన దాఖలాలు లేవు. ఆయన నవ్వకూడదని భీష్మించుక కూర్చోలేదు. నడివయస్సు దాటి నడుము వంగిపోయినా, ఆయనకు మిగిలిన ఆస్థి, నలుగురు ఆడపిల్లలు ఆ తర్వాత యిద్దరు మగ నలుసులు.

'ఏమిటి మాస్టారూ! ఆలోచిస్తున్నారు. రాధమ్మ చెల్లి పేరుమీద టిక్కెట్టు కొనేయండి లక్ష్మీదేవి మిమ్మల్ని వరించకపోతే నన్నడగండి.'

మాస్టారులో ఆశ చిగురించింది, మొగ్గలు వేసి పువ్వులు పూయడం ప్రారంభించింది.

అటూ యిటూ చూసి మెల్లిగా అన్నారాయన

'నిజంగా వస్తుందంటావా సుందర్రావ్ !'

'ఏమిటి మాస్టారూ మీ సందేహం? ఏదో ఒక ప్రైజ్ తగలకపోతే చూడండి, నేను మంచి మనస్సుతో యిస్తున్నాను తీసుకోండి' సుందర్రావ్ టిక్కెట్టును ఉదారబుద్ధితో రూపాయ తీసుకుని దానం' చెయ్యబోతున్నాడు. మాస్టారు జాగ్రదావస్థలో కలలు కంటున్నారు.

ఐదు లక్షలు, పోనీ ఓ లక్ష, అంత వద్దు, పది వేలు చాలు. అందరమ్మాయిలకు ఒకేసారు పెళ్ళిళ్ళు చేసేయొచ్చు, కొడుకుల్ని ఒక డిగ్రీ వరకైనా చదివించొచ్చు పాపం పిచ్చి శాంతకు మొదట ఒక జత నల్లపూసల బంగారుగాజులు చేయించాలి. ఎప్పుడో పది సంవత్సరాల క్రితం అడిగడిగి మానుకుంది. తను కూడా ఒక పంచెల జత కొనుక్కుంటే బాగుంటుంది. తనకున్న జత మరీ పాతదయిపోయింది. యింటి ఆడబడుచుల విషయం యీ దరిద్రంలో మర్చిపోయాడు. వాళ్ళను పిల్చి పసుపు కుంకుమ పెట్టి పంపించాలి.

'ఏమిటి మాస్టారు! దీనికింత ఆలోచన. రాధమ్మ తల్లి అదృష్టం మీద నాకు గట్టి నమ్మకం వుంది, మరి ఆలోచించకండి.'

సదానందం మాస్టారు వూహాల అలారం అతని మాటలతో బంగారం గలగలల్ని నింపుకొంది.

ఒక్క రూపాయికి యింత సులువైన మార్గంలో తన సమస్యలన్నీ పరిష్కార మవుతున్నపుడు తను తీరి కూర్చొని బీదరుపులు అరవడం ఏమీ బాగా లేదనిపించిందాయనకు.

'ఒక్కటివ్వవోయ్' అన్నాడు స్థిరంగా.

'ఏ నంబరు కావాలో తీసుకోండి సార్' అన్నాడు ఉత్సాహంగా లాటరీ టిక్కెట్లను ఫానులా పేర్చి.

మాస్టారు చెయ్యి ముందు కొచ్చింది మనస్సు వెనక్కు లాగుతోంది. 'ఒక వేళ....ఒక వేళ రాకపోతే ఒక్కరూపాయి అంటే ఒక్క కిలో బియ్యం, 4 పూటల కూరలు, యింట్లో నలుగురాడ పిల్లలకు చేతికి గాజులు, లేదా జడలోకి వారం రోజుల మల్లెపూలు' - అతని చేతులు వణికాయి.

'ఛీ....ఛీ పాడు మనస్సు ఎప్పుడూ వున్న గొడవలే - ఎప్పుడూ తీరని కోరికలే'. బాధ్యతను ఆశ గెల్చుకుంది. యీమారు చెయ్యి ధైర్యంగా ముందు కెళ్ళింది. ఒక కాగితాన్ని పట్టుకుని లాగితే రెండు కాగితాలు వచ్చాయి. ఒకదాన్ని తిరిగి యిచ్చేయాలనుకున్నాడు కాని 'దేన్నివ్వాలి? ఇచ్చేసిందానికి ప్రైజ్ వస్తే !....!'

'ఇవ్వనా మాస్టారూ !'

'నాకు ఒక్కటి చాలోయ్'

'సరే ఏ టిక్కెటివ్వమంటారు ?'

పైనున్న టిక్కెట్టు యివ్వబోయారు మాస్టారు - చేతులు సన్నగా వణికాయి ఆ టిక్కెట్టుకు ప్రైజ్ వచ్చి తనని దురదృష్టవంతుని చేస్తుందేమో.... "వద్దు .... వద్దు మాస్టారూ ! యివ్వకండి అదీ వుంచండి దానికే ప్రైజ్ వస్తే మర్లా మనం బాధ పడాల్సి వస్తుంది."

ఆ రెండు టిక్కెట్లే గాక అతని చేతిలో యింకా చాలా టిక్కెట్లు వున్నాయని వాళ్ళిద్దర్లో ఒక్కరికీ గుర్తు రాలేదు.

గుర్తు వచ్చినా సుందర్రావ్, చెప్పి ఆ మాష్టార్ని బాధించ దల్చుకోలేదు. అతని మానవత్వం అలాంటిది. ఆ బీదమాష్టారు రెండు రూపాయల కంటే ఎక్కువ ఖర్చు పెట్టలేదని సుందర్రావుకు బాగా తెలుసు.

"వెళ్ళండి మాష్టారు! వచ్చే నెల యీ వరకు మీరు లక్షలకు అధిపతయిపోతారు. గుర్తుంచుకోండి మాష్టారూ నన్ను."

సుందర్రావ్ ఇస్తున్న భరోసా తాలూకా మత్తులో మొదట మాష్టారుకు తెలియలేదుగాని ఆ మత్తు దిగేకొలదీ అతనికి తను ఖర్చుపెట్టిన రెండురూపాయలు ఎంత విలువయినవో ఆకలితో నకనకలాడే తన పేగులకు అవెంత అవసరమో అతనికి బోధపడసాగింది. అతను తను చేసిన తెలివితక్కువ పనిని ఎవరికీ చెప్పదల్చుకోలేదు. కాని తన బాధను, అసంతృప్తిని, అతను తన అర్ధాంగితో పంచుకోకుండా వుండలేకపోయాడు. ఆ రాత్రి తన భర్త సముఖంలో జరిగిన సంగతి తెలుసుకొన్న శాంత "మన కంతదృష్ట మెక్కడిది? రెండు రూపాయలు నష్టపోవడం తప్ప" అని తన నిరాశావాదాన్ని వెల్లడి చేసింది.

యధావిధిగా పదవ తారీఖుకల్లా జీతం అయిపోయింది. మరో పది రోజులు మామూలు ప్రకారం అప్పులతో బండి లాక్కొచ్చారు. మిగతా పదిరోజులే మాష్టారుగార్కి గడ్డు రోజులు. నెలాఖరులో తన అరుగుమీద టిచ్చుగాడు తినే

నాలుగురకాల మెతుకులవంక ఆశగా చూచే పసివాళ్ళను చూసినప్పుడు ఆ భార్యాభర్తలకు ఆత్మహత్య చేసుకోవాలని పిస్తుంది. ఆ యిరవై రెండవ తారీఖున అలా కాళ్ళీడ్చుకుంటూ మంచు ఉండలో నడచిపోతున్న మాస్టారుకి తన జేబిలోవున్న రెండు టిక్కెట్లు చాల బరువుగా మోయలేనంత భారంగా వున్నాయి. ఆ రెండురూపాయల విలువ భూతద్దం వెనుక చేరి అతన్ని వెక్కిరిస్తోంది. నాలుగు పూటల - నాలుగు మెతుకు లకు దూరంచేసిన ఆ టిక్కెట్లు అతని గుండెకు పాముల్లాగా మెత్తగా తగుల్తున్నాయి. తాను చేసిన అవివేకపు పని చంటివాడి ఏడుపు రూపంలో వెక్కిరిస్తోంది.

ఎదురుగుండా చలపతి మాస్టారు వడివడిగా వస్తున్నారు. అతన్ని చూడగానే సదానందం మాస్టారి కళ్ళల్లో ఆశ తళుక్కు మంది. క్షణం అభిమానం అడ్డువచ్చింది. చలపతి ఆ స్కూల్లోనే రెండవ మాస్టారు. ఇప్పటికే అతని దగ్గర ఐదు రూపాయలు అప్పు తీసుకున్నాడు. 'మళ్లా అడగడం ఎలా?'. అతను దగ్గర కొచ్చేస్తున్నాడు. అడగాలి. ఏమైనా అడిగేయాలి. కాదన్నా సరే అడిగేయాలి. ఛీ కొట్టినాసరే అడిగేయాలి. బాధ పడకూడదు. అలా నిశ్చయించుకొన్న సదానందం మాస్టారి ధైర్యం, చలపతి మాస్టారు కనపడగానే సన్నగిల్లింది. 'రెండు రూపాయలుంటే సర్దగలవా?' అని అడగాలని తెరచిన అతని నోరు

"ఎక్కడికోయ్ ! అంత హడావుడిగా వెళ్తున్నావ్" అని అడిగింది.

"ఏం లేదండీ! ఓ రెండు లాటరీ టిక్కెట్లు పట్టుకు రమ్మని మా ఆవిడ గొణుగుతుంటేనూ, సుందర్రావ్ ప్రక్క వూరికి వెళ్ళిపోతాడేమోనని" నసిగాడు.

హఠాత్తుగా లాటరీలో లక్ష రూపాయలు వచ్చినంత సంతోషమేసింది సదానందం మాస్టారుకి. తన జేబిలో వున్న లాటరీ టిక్కెట్లు తడుముకున్నాడు. అవి అక్కడే చలనం లేకుండా సురక్షితంగా వున్నాయి. అతని నోరు యీ మారు అనాలనుకున్న మాటను అనేసింది.

"మొన్న ఎవరో అమ్మిపెట్టమని నా చేతికి కొన్ని టిక్కెట్లు యిచ్చారోయ్ అందులో రెండు మిగిలాయి తీసుకుంటావా?" అలా అనేసిన తర్వాత ఆయనకు పెద్ద సందేహం వచ్చింది. 'కొంపదీసి టిక్కెట్లు తీసుకోని అప్పు తాలూకా ఐదు రూపాయల్లో చెల్లు పెట్టుకోమనడు గదా!' ఆయన బాధల్ని, భయాల్ని అవతలవాడు పసిగట్టేస్తూ పెద్దగా నవ్వుతూ అన్నాడు చలపతి.

"ఇవ్వండి మాస్టారూ మీ చేయి చలవ చూస్తాను."

గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటూ రెండు టిక్కెట్లు చలపతి చేతిలో పెట్టేశాడు. చలపతి మరి మాట్లాడకుండా రెండు రూపాయలిచ్చేసి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. ఆ రెండు రూపాయల నోటును అతి జాగ్రత్తగా గుప్పెట్లో మడిచి మడిచి బియ్యం పప్పుడబ్బాలో పడేశాడాయన.

* * *

"ఈ శుభవార్త విన్నారా మాస్టారూ !" ప్రక్కింటి పరుశురామ్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిటి ?" అన్నట్లు కళ్ళజోడులోనుండి చూస్తూ ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చోమని సంజ్ఞ చేశాడు.

అతను తీరిగ్గా కూర్చుంటూ అన్నాడు.

"సుందర్రావు అన్నట్టు మన వూరికి అదృష్టం పట్టే రోజులొస్తున్నాయి."

భర్తకు కాఫీ ఇద్దామని వచ్చిన శాంత ప్రక్కింటి పరుశురామ్‌ను చూచి గతుక్కుమంది ? రెండు రోజులుగా కాఫీలేక తలనొప్పితో బాధపడుతున్న భర్త అవస్థ చూడలేక పక్కింటి మహాలక్ష్మమ్మ దగ్గర అరువు తెచ్చుకున్న చిటికెడు కాఫీపొడితో కాసిన కప్పుడు కాఫీ అది.

"రండి అక్కయ్యా ! మీకో శుభవార్త చెప్తాను" పరుశురామే అలా పిలడంతో వెనక్కి వెళ్ళడానికికూడా ఆమెకు అవకాశం లేకపోయింది. బలవంతంగా చిరునవ్వును కాఫీపొడిలాగే అరువు తెచ్చుకొని, చేతిలోని కాఫీని మనస్సుకు వ్యతిరేకంగా అతని కందించింది.

కప్పు అందుకుని "మీరు మాస్టారూ !" అన్నాడు మర్యాదకోరకు.

"నా కాఫీ అయిపోయింది. నువ్వు కానీ" పైకినవ్వుతూ అన్నా మనస్సు నిండా నీరసం వచ్చేసింది.

భర్తను తలచుకొని శాంత కళ్ళు ఆర్ద్రమయ్యాయి

తీరిగ్గా కాఫీ త్రాగి మొదలెట్టాడు పరుశురామ్.

"మీ చలపతి మాస్టారుకి థర్డ్‌ప్రైజ్ వచ్చిందట మద్రాసు లాటరీలో."

అంతవరకు యథాలాపంగా వింటున్న మాస్టారి పంచేంద్రియాలు ఆ మాటలతో ముద్దకట్టుకుపోయాయి. తన ఆశ్చర్యాన్ని, ఆవేదనను ఆనందంగా చూపాల్సివచ్చినందుకు బాధ.

"మొత్తానికి చలపతి అదృష్టవంతుడు మాస్టారూ. పిల్లా పాపా లేరు. ఉండేది భార్యా భర్తే. ఇప్పుడే పూలరంగడిలా తిరుగుతుంటాడు. ఇంక దశ తిరిగిపోయిందనుకోండి. మరలా మీకు క్రొత్త మాస్టారు రావాల్సిందే. లక్షలకధికారి ఇంకా మాస్టారుద్యోగం చేస్తాడంటారా!" పరశురామ్ సగం ఉత్సాహంతో, సగం మాత్సర్యంతోనూ చెప్పుకుపోతున్నాడు. సదానందం మాస్టారు అదేం వినడంలేదు.

కొన్ని లక్షలు, కొన్ని వేలు .... ప్రైజు ఎంతో తెలియదు. ఎంతయితేనేం తనకు రావాల్సిన ప్రైజు అది. తన అసమర్థతతో, పనికిరాని అభిమానంతో అవివేకంగా పారవేసుకున్న అదృష్టం అది. తనకు కాళ్ళు కడిగి వరించాల్సిన అఖండమైన సిరి.

మెడలో మెరిసే మాంగల్యంతో పచ్చటి పాదాల పారాణితో నును సిగ్గుతో నలుగురు కూతుళ్ళు తలలు వంచుకొని తమ కాళ్ళకు నమస్కరిస్తున్నట్లు తన కళ్ళముందు మెరిసి ఛిన్నాభిన్నం అయిపోయింది.

తన కొడుకులు పెద్ద ఆఫీసర్లయి తలా ఒక సిటీలో తలా ఒక బంగళాలో వుంటే తను వెళ్ళి అప్పుడప్పుడు చూసే దృశ్యం క్రూరంగా వెక్కిరిస్తోంది.

'ఎంత అవివేకం! ఎంత అవివేకం!' మనస్సులోనే తనను కసితీరా తిట్టుకున్నాడాయన.

ఆ రోజు చలపతి కనపడకుండా వుండివుంటే ఎంత బాగుండేది! కన్పించినా తన జేబిలో టిక్కెట్లు లేకపోతే ఎంత బాగుండేది? అతన్ని కలుసుకున్న ఆకలి క్షణాలు ఎంత దరిద్రమయినవి?

పట్టుచీరలో ఒంటినిండా నగలతో భర్త ప్రక్కనే కార్లో వెడుతున్న చలపతి భార్య అతని తల చుట్టూ తిరిగి అతన్ని మరీ పిచ్చివాణ్ని చేస్తోంది.

మరలా ఒక్కమారు ఆ దరిద్రపు క్షణాల్ని దాటి వెళ్ళి తన టిక్కెట్టును తాను భద్రంగా దాచుకోవాలనిపిస్తోంది. జరగనిదేదో జరగాలనీ ఆశ. కాలం వెనక్కు తిరిగితే ఎంత బాగున్ను!

"ఏమిటో మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు. నేను వెళతాను మాస్టారు!"

ఉలిక్కిపడ్డాడు సదానందం మాస్టారు. తన మనస్సులో అసూయను, మాత్సర్యాన్ని ఇతరులు తెలుసుకోగూడదు, మాస్టారు మంచివారనే బిరుదు తన కెల్లకాలం కావాలి.

"లేదు.... లేదు. కూర్చోండి, మా చలపతికి ప్రైజు వచ్చిందంటే చాల సంతోషంగా ఉంది. చలపతిని అభినందించి రావాలి" కండువా దులుపుకొని లేచారు. ఆ పరిస్థితుల్లో మరో రెండు నిమిషాలు పరశురామ్‌కు ఎదురుగా కూర్చుంటే తన మనస్సు బయటపడిపోవచ్చును.

పరశురామ్ వెళ్ళిపోవడంతో మళ్లా అక్కడే చతికిల బడ్డాడు.

విషయం అర్థం చేసుకుంది శాంత.

టికెట్టు కొన్నరోజు "మనకంత అదృష్టమెక్కడిది? రెండు రూపాయలు ఖర్చు తప్ప" అని తన నిరాశావాదాన్ని వెల్లడించిన శాంత ఈ రోజు "రెండుపూటలు వెధవ కడుపులు నింపుకోడానికి అదృష్టాన్ని కాలదన్నుకొన్నాము" అంది బాధగా. వెంటనే "పోనీలెండి మనకింతే ప్రాప్తం. మీరు బాధపడి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు" అని లోపల కెళ్ళింది.

నిజానికి చలపతి యింటికి వెళ్ళాలనిలేదు. వెళ్ళి వెలిగే చలపతి ముఖాన్ని చూచి తను ఓర్చుకోలేడని తనకు తెలుసు. కాని వెళ్ళాలి. సదానందం మాస్టారు అసూయపరుడు కాదని లోకాన్ని నమ్మించడానికైనా వెళ్ళాలి. అసూయ కాన్సరు లాటిది. తొందర తొందరగా శరీరంలో ప్రతి భాగాన్ని ఆక్రమిస్తుంది. దీన్నుంచి తప్పించుకోవాలి. ఎలాగైనా తప్పించుకోవాలి. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

* * *

ఆ సాయంత్రం కాళ్ళీడ్చుకుంటూ చలపతి ఇంటి కెళ్ళాడు. వరండాలోనే కూర్చుని వున్న చలపతి మాస్టారు నిండుగా నవ్వుతూ ఆహ్వానించాడు. వ్యతిరేకించే మనస్సును జోకొట్టి మాట పెగుల్చుకొని అన్నాడు సదానందం మాస్టారు.

"చాలా సంతోషమోయ్ చలపతీ!"

"దేనికి మాస్టారూ !"

ప్రైజు వచ్చినంత సంతోషంగా లేని అతని ముఖం చూస్తుంటే ఒళ్ళు మండింది సదానందం మాస్టారుకు.

'ఇడియట్ వాడికి ప్రైజు వచ్చిందంటే నేను కుళ్ళు కుంటానని కాబోలు చెప్పకుండా దాస్తున్నాడు. ఏమైనాసరే ! తనకేమీ అసూయ లేనట్లు, అదృష్టం తెచ్చిచ్చే ఆ డబ్బంటే లెక్కలేనట్లు వుండాలి' మనస్సులోనే గట్టిగా అనుకున్నాడు. తన వూహాల్ని సంస్కారం పొర వెనుక దాచేస్తూ అన్నాడు. 'నీకు ప్రైజు వచ్చిందంటే నాకొచ్చినంత సంబరంగా వుందోయ్ చలపతీ !'

'ఏం ప్రైజు మాస్టారు ?' అయోమయంగా చూస్తున్న చలపతిని చూస్తే అరికాలిమంట నెత్తికెక్కింది 'రాస్కెల్ ! తను టిక్కెట్టిచ్చాను కదాని బేరాలాడి బ్రతిమిలాడడానికి వచ్చానని కాబోలు దాస్తున్నాడు.'

"అదేనోయ్ ! లాటరీలో ప్రైజు"

'ఓ అదా. చంపేశారు పొండి మాస్టారూ !' గొల్లున నవ్వాడు చలపతి. 'మీకు పరశురామ్ చెప్పాడా ? ప్రొద్దున డ్రా రిజల్ట్సు వచ్చాయంటే పేపర్ తెప్పించి చూస్తున్నాను. పరశురామ్, రఘునాథ్, రంగారావు వచ్చారు. నంబర్లు చూస్తున్నప్పుడు కళ్ళు బైర్లు కమ్మాయి. సరిగ్గా మీరిచ్చిన టిక్కెట్టు నంబరున్నట్లే అనిపించింది. దానిని టాం....టాం.... వెయ్యడానికి కాబోలు పరశురామ్ అప్పుడే పరుగెట్టాడు.

నేను, రంగారావు తీరిగ్గా చూస్తే ఆ నంబరు కాదు. ఒకటిని ఏడుగా పొరపడ్డాం" అని యింకా నవ్వుతూనే

"ఏడు భలే మంచింది మాస్టారూ !" అన్నాడు.

ఒక్క నిముషం తర్వాత సదానందం మాస్టారుకి తన మనస్సుకు ఎంతో ఆనందంగా పెద్ద బరువు తీరిపోయినట్లని పించింది. తన సమస్యకు పరిష్కారం దొరికినట్లు తనకింక సమస్య లే లేనట్లు ఇంతవరకు ఎంతో భారంగావున్న హృదయం ఒక్కమారుగా తేలికపడినట్లు చాల ప్రశాంతంగా వుందని పించింది. దానికి కారణంకూడా అంతరాత్మ అట్టడుగున ఆయనకు బాగా తెలుసు కానీ ఆ విషయాన్ని మనస్సులో సైతం నమ్మడానికి ఆయన సిగ్గుపడుతున్నాడు.

తను లాటరీ టిక్కెట్టు కొనాలనుకున్నప్పటినుండి తను అనుభవించిన విచిత్రమైన సంఘర్షణలను తల్చుకొని యీ నాటికవి తీరిపోయినందుకు గుండెలనిండా గాలి పీల్చుకున్నా రాయన.

"అరే చాల దురదృష్టం చలపతీ !"

తన అదృష్టం వెంట్రుక వాసిలో ఏడు అంకెలలో అన్యాయంగా జారిపోయినందుకు చలపతి మనస్సులో ఏం బాధపడ్డాడో గాని పైకి మాత్రం నవ్వేస్తూ అన్నాడు.

"అంతా మన ఆశ మాస్టారూ !"

* * *

తన గుడిశతో పాటు మరో గుడిశకూడా మేడగా మారితే కుళ్ళుకునేవాడు ద్రోహి. తన గుడిశ అలా నిశ్చలంగా ఉండగానే ప్రక్కవాడి గుడిశ ఆకాశాన్నంటితే కూడా మనస్ఫూర్తిగా చిరునవ్వుతో చూడగలిగినవాడు త్యాగి. తను ఒక్క అడుగైనా వెయ్యకుండానే తోటివాడు కోటీశ్వరుడైతే బాధపడేవాడు సామాన్య మానవుడు. అందుకే యిందులో సదానందం మాస్టారి దోషం వీసమెత్తు లేదు. అతను రక్తమాంసాలున్న సామాన్య మాన[illegible]. అతను సగటు మనిషి.

---